జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 9-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 214 పేజీలు: 4 వెల: రూ.7

# సుందరీకరణకు.. ఇదా సమయం!





* పాలకొండ రోడ్డులో చెట్ల తొలగింపు * రోడ్డుపైనే చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు * తొలగింపులోనూ మున్సిపల్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం * ఒక ప్రణాళిక ప్రకారం తొలగించని చెట్లు, స్తంభాలు * డివైడర్లపై ఉన్న ఇనుప కంచెలు పనికిరాకుండా చేశారు * నగరపాలక సంస్థ నిధులంటే అంత అలుసా * తొలగింపుల చోట కానరాని అధికారులు * పండగ సమయంలో చెట్ల తొలగింపుపై ప్రజల్లో అసహనం * రోడ్డులో ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు * విశాఖలో పీఎం బందోబస్తున్న తరలిన పోలీసులు * పాలకొండ రోడ్డులో ట్రాఫిక్‌జాం

**శ్రీకాకుళం క్రైం, జనవరి 8 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని రోడ్లు అసలే ఇరుకు.. పండగ సమయం కావడంతో పల్లె, పట్టణాల నుంచి శ్రీకాకుళం నగరానికి దుస్తులు, ఇతరత్రా సామగ్రి కొనుగోలు చేసేందుకు జిల్లావాసులు తరలివస్తున్నారు. జీటీరోడ్డు, పాలకొండ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, పాతబస్టాండ్‌లో విపరీతమైన రద్దీగా ఉంటుంది. సంక్రాంతి సమయం కావడంతో ఈ రహదారుల్లోని వ్యాపార దుకాణాలు కిక్కిరిసి ఉంటుంది. ఇలాంటి సమయంలో నగర సుందరీకరణ పేరిట ఏడురోడ్ల కూడలి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు పాలకొండ రోడ్డుపై డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను మంగళవారం రాత్రి నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. తొలగించిన వాటిని రోడ్డుపైనే పడేశారు. బుధవారం ఉదయం పాలకొండ రోడ్డు దిబ్బగా మారింది. డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను ప్రొక్లయినర్లతో ఒక క్రమపద్ధతిలో కాకుండా ఇష్టారాజ్యంగా తొలగించేశారు. విద్యుత్ స్తంభాలు కూలదోశారు. డివైడర్ మధ్య ఉన్న ఇనుప కంచెలు విరిగిపడ్డాయి. వీటిని చూస్తే నగరపాలక సంస్థ అధికారులు ఒక ప్రణాళిక లేకుండా ఏదో చేసేద్దాం అనే రీతిన పనులు చేపట్టినట్టు కనిపిస్తోంది. సంబంధిత కాంట్రాక్టర్ ఈ చెట్ల కొట్టే పనిలో డబ్బులు ఎంతెస్తుందని బేరీజు వేసుకున్నాడు తప్ప ఇతరత్రా ప్రయోజనాలు పట్టించుకున్న దాఖలాలు లేవని రోడ్డుపై పడి ఉన్న చెట్లను, విరిగిన ఇనుప కంచెలను చూస్తే ఇట్టే అర్థమవుతోంది. అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నారు. దీంతో ప్రజాప్రతినిధుల సూచనల మేరకు నగర సుందరీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఏడురోడ్ల కూడలి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజామున వరకు 361 చెట్లు యంత్రాలతో కొట్టేశారు. అయితే డివైడర్లతో పాటు తొలగించిన చెట్లను కొన్నిచోట్ల రోడ్లపై వదిలేయడంతో బుధవారం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నగరపాలక సంస్థ, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొక్కలు తొలగించడం కోసం రెండు రోజులుగా పాలకొండ రోడ్‌లో వాహనాల రాకపోకలు నిలిపివేయడం అనాలోచిత నిర్ణయమని పండగ సమయంలో ఇదేం పని వ్యాపారులు నగరపాలక సంస్థ అధికారులను నిలదీశారు. పండగ అయిన తర్వాత సుందరీకరణ పనులు చేయొచ్చుకదా అని కొందరు వ్యాపారులు అగ్రహం వ్యక్తం చేశారు.





# విద్యార్థులా.. కూలీలా!



* న్యూసెంట్రల్ స్కూల్ వద్ద బెంచీలు మోసుకుంటూ కనిపించిన విద్యార్థులు
* దగ్గరుండి పనులు చేయించిన స్కూల్ యాజమాన్యం
* ఇదేంటని ప్రశ్నిస్తే.. వారు స్వచ్ఛందంగా చేస్తున్నారన్న సిబ్బంది వకల్తా
* మాజీ ఉన్నతాధికారి ఆధ్వర్యంలోనే ఈ పనులపై విమర్శలు





**శ్రీకాకుళం క్రైం, జనవరి 8 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ యాజమాన్యం.. అక్కడి విద్యార్థులను కూలీలను మార్చేసింది. బుధవారం ఆ పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులచే బెంచీలు మోయించడం కనిపించింది. విద్యాబోధన చేయాల్సిన వారు బెంచీలు మోయించడం ఏంటని పలువురు ముక్కున వేలేసుకున్నారు. దీన్ని మీడియా ప్రతినిధులు ఫొటోలు తీస్తుండగా, పాఠశాల సిబ్బంది అడ్డుకున్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా ఈ పని చేస్తున్నారని, తామేమి బలవంతం చేయడం లేదని యాజమాన్యానికి వకల్తా పుచ్చుకుని సిబ్బంది మాట్లాడారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో ఇటువంటి పనులు చేయడమేమిటని అక్కడున్న వారంతా నిలదీశారు. శ్రీకాకుళం జిల్లాలో గతంలో ఒక ఉన్నతమైన స్థానంలో పనిచేసిన అధికారి పర్యవేక్షణలో ఇటువంటివి జరగడం, ఆయన కూడా చూసీచూడనట్టు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 12న మందసలో ముగ్గుల పోటీలు

**మందస, జనవరి 8(వార్త):** మందసలో ఈనెల 12న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు పూనా ఈశ్వరరావు-9494588963, వడ్డి అప్పారావు-9949756659 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేయించుకోవాలని సూచించారు. శ్రీసత్యసాయి సేవా సమితి(బృందావన్), మహేంద్ర థియేటర్ ఎదురుగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు మూడు గ్రూపులకు వేర్వేరుగా ఉంటాయన్నారు. పోటీలో పాల్గొనే మహిళలు 20 నిముషాలు ముందుగా రావాలని, ఏ ఫోర్ సైజు తెలుపు కాగితాలు ఇస్తామన్నారు. ప్లాంక్, పెన్సిల్స్, ఎరైజర్స్, కలర్స్ తెచ్చుకోవాలన్నారు. 10 నుంచి 20 ఏళ్ల వరకు 'ఏ' గ్రూపు గాను, 21 నుంచి 35 ఏళ్ళ గల వారికి 'బి' గ్రూప్‌గా, 36 ఏళ్ళు పైన వయస్సు గల వారికి ' సీ' గ్రూపు గాను పరిగణిస్తామన్నారు. బహుమతులను సంక్రాంతి రోజున 14న సాయంత్రం 6:30 గంటలకు మందిర నామ సంకీర్తన అనంతరం, మూడు గ్రూపుల వారికి ఫస్ట్, సెకండ్, థర్డ్ బహుమతులు ఇవ్వబడతాయన్నారు. ఈ అవకాశాన్ని మందస మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# జడ్పీ బడ్జెట్‌కు ఆమోదం




**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** జిల్లా పరిషత్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-2025 సంవత్సర సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టగా.. జిల్లా ప్రజా పరిషత్ సహా పి.ఐ.యు, పంచాయతీరాజ్, పి.ఆర్.ఐ శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించిన బడ్జెట్ లు మొత్తం క్రోడికరించి అన్ని పద్దుల క్రింద 2025-26 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ సందు రూ. 1580,59,07,806లను రాబడిగా అంచనా వేస్తూ అందులో రూ. 1462,20,29,241లు ఖర్చును అంచనా చూపిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.118,38,78,565లను బడ్జెట్ గా పొందుపరిచారు. జిల్లా ప్రజా పరిషత్, శ్రీకాకుళం తో సహా పి.ఐ.యు డివిజన్, పంచాయతీరాజ్, శ్రీకాకుళం, పి.అర్.ఐ., పంచాయతీరాజ్, శ్రీకాకుళం, పి.అర్.ఐ., పంచాయతీరాజ్, టెక్కలి, పి.అర్.ఐ., పంచాయతీ రాజ్, పాలకొండ మరియు గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య, శ్రీకాకుళం వారి బడ్జెట్‌లు క్రోడీకరించి అన్ని పద్దుల క్రింద 2024-25 సంవత్సరం సవరణ బడ్జెట్ మొత్తం రూ.1411,54,99,739 రాబడిలో రూ.1306,32,44,486లు ఖర్చు చూపిస్తూ సంవత్సరాంతానికి మిగులు రూ.105,22,55,253 లను అంతిమ నిల్వగా చూపించారు. సభ్యులంతా ఈ అంశాల వారీగా చర్చ నిర్వహించి బడ్జెట్ కు ఆమోదం తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి ఎల్ ఎన్ వి శ్రీధర్ రాజా, ఉప ముఖ్యకార్య నిర్వహణాధికారి డి.సత్యనారాయణ, పి.ఐ.యు డివిజన్, పి.అర్.ఐ., పంచాయతీరాజ్, శ్రీకాకుళం కార్యనిర్వాహక ఇంజినీరు ఎస్.రామకృష్ణ, పి.అర్.ఐ., పంచాయతీరాజ్, టెక్కలి, పాలకొండ కార్యనిర్వాహక ఇంజినీర్లు, పర్యవేక్షక ఇంజినీరు, గ్రామీణ నీటి సఫరా, పారిశుధ్య ఇంజనీర్లు, జడ్పీ ఉపాధ్యక్షురాలు పాలిన శ్రావణి, పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నరసన్నపేట, జనవరి 8 (వార్త):** ఆర్థిక్యపడవద్దు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం ఆయన నరసన్నపేట టీడీపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక వృద్ధాశ్రమంలో పనిచేస్తున్న కేవీఎస్ శాంతమూర్తికి రూ.1.50లక్షల చెక్కును అందజేశారు. పప్పుల వీధికి చెందిన తంగుడు ప్రమీలకు రూ.81 వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గొప్ప మానవత్వం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## క్రీడల్లో హరిపురం విద్యార్థుల ప్రతిభ



**మందస, జనవరి 8(వార్త):** హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన గ్రిగ్స్ పోటీల విజేతలను బుధవారం పాఠశాలలో అభినందించారు. అండర్-17 విభాగంలో 100మీటర్లు పరుగు పందెంలో కె.సాయి ద్వితీయస్థానం, 400మీటర్లలో తృతీయ స్థానం, లాంగ్ జంప్‌లో తృతీయ కైవసం చేసుకున్నాడు. సీహెచ్.కార్తీక్ 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 1500 మీటర్లలో తృతీయస్థానం సాధించాడు. 4X100మీటర్ల రిలేలో తృతీయస్థానం సాధించాడు.బాలురు అండర్-17 విభాగం బ్యాడ్మింటన్‌లో రన్నర్‌గా నిలిచాడు. ప్రధానోపాధ్యాయుడు ఉమారాజ్ క్రీడాకారులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జె. పురుషోత్తం, ఎస్ఎంసీ చైర్మన్ కొంచాడ సురేష్‌కుమార్, పీడీ సవర రామారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**మెళియాపుట్టి, జనవరి 8 (వార్త):** విద్యతో పాటు క్రీడల్లో సైతం గిరిజన యువత రాణించాలని మాజీ ఎంపీపీ బైరిసింగి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఆయన వెంకటాపురంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో మెళియాపుట్టి, టెక్కలి నందిగాం మండలాల చెందిన 30 టీములు పాల్గొన్నాయి. ఈనెల 12న ఫైనల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు, గిరిజన యువత పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

**సంతబొమ్మాళి, జనవరి 8(వార్త):** మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో బుధవారం పంచాయతీ సెక్రటరీ అనిల్ ప్రభాస్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధులు శుభ్రం చేసి మురుగు కాలువల పూడికతీత పనులు చేపట్టారు. పంచాయతీ సెక్రటరీ ప్రజలతో మాట్లాడుతూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.

## నగర సుందరీకరణ పనులకు శ్రీకారం



**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో విషం చిమ్ముతున్న మోనోకార్పస్ మొక్కలను రెండు రోజులుగా శరవేగంగా తొలగిస్తున్నారు. దీంతో పాటు నగర అభివృద్ధి, సుందరీకరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ స్వయంగా పర్యవేక్షించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ డీవీ ప్రసాదరావు, మున్సిపల్ ఎంఈ దక్షిణామూర్తి, మున్సిపల్ అధికారులు ఉమామహేశ్వరరావు, ఎలక్ట్రికల్ సిబ్బంది, పర్యావరణ అధికారులు, పలువురు పట్టణ ప్రముఖులు, స్థానికులు తదితరులు ఉన్నారు.



## ప్లాస్టిక్ అమ్మితే జరిమానా తప్పదు



**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** ప్లాస్టిక్ అమ్మకాలను నిషేధించామని, ఎవరైనా అమ్మితే జరిమానా తప్పదని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వి.సుధీర్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన శ్రీకాకుళంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్లో తనిఖీలు నిర్వహించారు. పలువురు వ్యాపారుల వద్ద ఉన్న నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. ఆయా దుకాణదారులకు రూ.14000ల వరకు జరిమానా విధించారు.



# సమస్యలను పరిష్కరించరా..?

-గ్రామసభలో సభ్యులు నిలదీత



**మెళియాపుట్టి, జనవరి 8(వార్త):** కొన్నాళ్లుగా గ్రామంలో వివిధ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్న గాని వాటి పరిష్కారంలో పంచాయతీ వారు ఎందుకు తాత్సారం చేస్తున్నారని, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మీపై లేదా అని సర్పంచ్ ప్రతినిధికి గ్రామస్తులంతా ముక్తకంఠంతో ప్రశ్నించిన వైనం మెళియాపుట్టి మండలం రట్టిని గ్రామంలో చోటుచేసుకుంది. ఆ గ్రామంలో కార్యదర్శి సుహాసిని మహాపాత్రో ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో గ్రామంలో కొన్ని రోజులు మంచినీటి కొళాయి వస్తే కొన్ని రోజులు వరకు నీరు రావడం లేదని, శానిటేషన్ కూడా సకాలంలో చెయ్యకపోవడం వల్ల పరిశుభ్రత లోపిస్తుందని, వీధిదీపాలు సరిగ్గా పనిచేయకపోవడం, తాగేనీటి హ్యాండ్ బోర్ సైతం చాలా కాలంగా సరిగ్గా పనిచేయదం లేదని ప్రజలు నిలదీశారు. దీని గూర్చి ఎన్ని మార్లు చెప్పినా ఎటువంటి ప్రయోజనం లేదని, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు ఉపయోగించే నీరంతా రోడ్డు పైకి రావడం, గ్రామంలో ఉన్నటువంటి విద్యుత్ స్తంభాలలో చాలావరకు మరమ్మతులకి గురయ్యాయని.. దీంతో ఎప్పుడు, ఏం ప్రమాదం జరుగుతుందోనని, పంచాయతీ భవనానికి గడిచిన కొంత కాలంగా విద్యుత్ సరఫరా లేదని వంటి సమస్యలపై గ్రామస్తులంతా కలిసి ముక్తకంఠంతో గ్రామసభలో ప్రశ్నించారు. దీంతో సర్పంచ్ ప్రతినిధి హరిచంద్రశ్యామ్ మాట్లాడుతూ గతంలో చేసిన పనులకు సంబంధించి నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, నిధులు వచ్చిన తర్వాత పనులు చేస్తామని తెలిపారు. ఈ సభలో జనసేన పార్టీ నాయకులు ప్రశాంత్ శివాజీ, జగన్నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురంలో భూకంపం

### పరుగులు దీసిన జనం

**ఇచ్ఛాపురం, జనవరి8(వార్త):** ఇచ్ఛాపురంలో బుధవారం రాత్రి 10:59 గంటకు స్వల్పంగా భూకంపం వచ్చింది. కొన్ని సెకనులు పాటు పెద్ద శబ్దంతో భూమి కంపించడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామగ్రి ఊగడంతో, ప్రజలు బయటకు పరుగులు పెట్టారు. గతంలోనూ ఈ ప్రాంతంలో పలుమార్లు భూమి కంపించిందని స్థానికులు చెబుతున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఫసల్ బీమా నమోదుకు 10 వరకు గడువు

**వంగర, జనవరి 8 (వార్త):** ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదుకు ఈనెల 10 వరకూ అవకాశం ఉందని వంగర మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు తెలిపారు. రభీ సీజన్ లో వరి సాగు చేస్తున్న రైతులు ఎకరానికి 630 రూపాయలు ప్రీమియం ఇన్సూరెన్స్ చెల్లిస్తే ప్రభుత్వం ఎకరానికి 42 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. గత నెల చివరి నాటికి గడువు పూర్తయినప్పటికీ ఈ నెల 10 వరకు ప్రభుత్వం పొడిగించారన్నారు. ఆధార్ కార్డు వన్ బి రైతు సేవా కేంద్రం ద్వారా పొందిన పంట నమోదు పత్రం బ్యాంక్ ఎకౌంటు పత్రాలతో మీసేవ కేంద్రాల్లో రైతులు బీమా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు ఈ యొక్క చక్కని సదవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి కన్నబాబు తెలియజేశారు.





## జాతీయ స్థాయికి సంతబొమ్మాళి సైన్స్ ప్రాజెక్ట్

**సంతబొమ్మాళి, జనవరి 8(వార్త):** సంతబొమ్మాళి ఎం జె పి బి సి డబ్ల్యూ ఆర్ స్కూల్, విద్యార్థులు రూపొందించిన "సస్టైనబల్ రైన్ వాటర్ మేనేజ్మెంట్ ఎగ్జిబిట్తో "ప్రాజెక్ట్ జాతీయ స్థాయి కి ఎంపికైందని ప్రిన్సిపాల్ ఎం కృష్ణ తెలిపారు. విజయవాడ లో బుధవారం రాష్ట్ర స్థాయి సైన్ ఎగ్జిబిషన్ జరిగిందన్నారు. ఈ ఎగ్జిబిషన్లో శ్రీకాకుళం జిల్లా తరఫున రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనపరిచిన విద్యార్థులు అంపోలు దీపక్, అ%శీ%జంగి శివ హరీష్ లను మరియు గైడ్ టీచర్ శ్రీమతి ఆరంగి సుధ ను పాఠశాల ప్రిన్సిపల్ ఎం సిబ్బంది అంతా ప్రశంసించారు. ప్రపంచమంతా త్రాగునీరు లభించక ఇబ్బంది పడుతున్న తరుణంలో మా ప్రాజెక్ట్ ఒక చక్కని సమాధానంగా ప్రోటో టైప్ మోడల్ పనిచేస్తూ వర్షపు నీటిని సక్రమంగా నిల్వచేసి వాటిని అనేక విధాలుగా సద్వినియోగం చేయడంలో ఈ మోడల్ సహాయపడుతుందని ఆయన అన్నారు.

## నేడు కిశోర వికాసంపై శిక్షణ

**వంగర, జనవరి 8 (వార్త):** వంగర ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కిశోర వికాసంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఐసిడిఎస్ సూపర్వైజర్ రజినిదుర్గ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయి అధికారులకు ఈ శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

## అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ..
## ఇచ్ఛాపురం విద్యార్థుల ఎంపిక



**ఇచ్ఛాపురం, జనవరి 8(వార్త):** విజయనగరంలో జనవరి 9 నుండి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్ 12 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్లకు శ్రీకాకుళం జిల్లా టీం తరుపున ఇచ్ఛాపురం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ (ఐసీసీ) కు చెందిన సాలిన సాయి డిషోజ్ యాదవ్, సమీత్ గౌడో, అధికారుల వెంకట్ దక్ష్( ఏ వి దక్షు) ఓం ప్రకాష్ ఎంపికయ్యారు. జిల్లా అండర్ 12 క్రికెట్ టీంకు ఇచ్ఛాపురం,నుండి నలుగురు విద్యార్థులు ఎంపిక కావడంతో ఇచ్ఛాపురం క్రికెట్ అకాడమీ కోచ్ గోపి ఆనందం వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులకు మాజీ క్రీడాకారులు ,తోటి క్రీడాకారులు అభినందనలు తెలిపారు. జిల్లా క్రికెట్ టీమ్ లో తమ పిల్లలు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## దాత వితరణతో భోజన శాల నిర్మాణం

**ఇచ్ఛాపురం, జనవరి 8(వార్త):** ఇచ్ఛాపురం, స్థానిక మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ స్థలం దాత దివంగత కాదా లక్ష్మీకాంతమ్మ, మన్మధరావు మనవడు డాక్టర్ కాదా మన్మధ కుమార్ లండన్లో సెటిల్ అయ్యారు. తన ఉదార స్వభావంతో విద్యార్థినిల కొరకు భోజనాలు చేసుకునేందుకు తన సొంత నిధులతో ఒక షెడ్ కట్టించారు .సుమారు 18 వందల చదరపు అడుగులు విస్తీర్ణంలో సుమారు ఆరు లక్షల రూపాయల వ్యయంతో మధ్యాహ్న భోజన శాల ను నిర్మించి స్కూలుకు అంకితం చేశారు.



# ప్రధాని సభకు తరలి వెళ్లిన టీడీపీ శ్రేణులు

- శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 87 ఆర్టీసీ బస్సులు
- 5000 మంది ప్రయాణం
- కిష్టప్పపేటలో బస్సులకు జెండా ఊపిన ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం, జనవరి 8 (వార్త): విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ప్రధాని మంత్రి సభ వైపే శ్రీకాకుళం జిల్లా ప్రజలంతా పయనమయ్యారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి 87 బస్సుల్లో సుమారు 5000 మంది విశాఖపట్నం సభకు వెళ్తున్నారు. ఈ సభకు వెళ్తే బస్సులను రూరల్ మండలం కిష్టప్పపేట గ్రామంలో ఎమ్మెల్యే గొండు శంకర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంతో దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీఏ పాలనలో ప్రజారంజక పాలన అందుతోందని తెలిపారు. ప్రధాన మంత్రి ఈ సభ ద్వారా విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లకు పైగా అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అటు మోదీ, ఇటు చంద్రబాబు పాలనలో దేశం, రాష్ట్రంలో సుభిక్షమైన పరిపాలన అందుతోందని చెప్పారు. ఇటువంటి సభలో నభూతోనభవిష్యత్గా రాజకీయ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. వీరి సంస్కరణలతో పేదలకు లబ్ది కలుగుతుందని, అంతిమయంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యమని చెప్పారు.



## విశాఖకు బయలుదేరిన 31 డివిజన్ ప్రజలు

**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** కూటమి ప్రభుత్వం వచ్చాక తొలిసారిగా విశాఖపట్నం కి పలు అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలన్న మంత్రి అచ్చం నాయుడు , ఎం.ఎల్.ఏ శంకర్ల పిలుపుమేరకు స్పందించిన 31 డివిజన్ టిడిపి ఇంచార్జ్ విభూది సూరిబాబు డివిజన్లో పలు వీధుల్లో మంగళవారం సాయంత్రం పర్యటించి ప్రజల్ని ,అభిమాములను,కార్యకర్తలను సమాయత్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం పెద్ద ఎత్తున ప్రజలు అభిమానులు కార్యకర్తలు నరేంద్ర మోడీ పర్యటనకు సూరిబాబు నేతృత్వంలో బయలుదేరగా స్థానికులకు మాస్క్ లను సరఫరా చేశారు. ఈ సందర్భంగా విభూది సూరిబాబు స్థానికులతో మాట్లాడుతూ విశాఖకు తొలిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచ్చేస్తున్నారని, 2 లక్షల కోట్ల కోట్ల మేర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టునున్నారని వివరించారు. ఆయన పర్యటన తప్పక విజయవంతం అవుతుంది అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పీఎంజే బాబు, ప్రధాన విజయరామ్, ఎస్ శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, సుభాష్ వెల్ఫేర్ సహాయకులు రామ రావు,తదితరులు ఉన్నారు.

# ఆన్ ది జాబ్ ట్రైనింగ్ విద్యార్థులకు కీలకం

**శ్రీకాకుళం, జనవరి 8 (వార్త):** వృత్తి విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థాయిలో శిక్షణ (ఆన్ ద జాబ్ ట్రైనింగ్) ఎంతో ఉపయోగపడుతుందని శ్రీకాకుళం ఇంటర్మీడియట్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి (డీవీఈవో) శివ్వాల తవిటినాయుడు అన్నారు. వృత్తి విద్య కోర్సుల అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఏటా ఆన్ ద జాబ్ ట్రైనింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విద్యార్థులకు శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న ఒకరోజు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోన్న అక్షయపాత్ర ఫౌండేషన్




కార్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

సరుకుల సరఫరా, వివిధ రకాల ఆహార వంటల తయారీ విధానం, పంపిణీ, అకౌంటింగ్ పుస్తకాల నిర్వహణ తదితర అంశాలపై సంస్థ మేనేజర్ వెంకటరాజు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ సూచనల మేరకు, ఇన్చార్జి ప్రిన్సిపాల్ వదనగిరి ఆదేశాలతో శ్రీకాకుళంలో విద్యార్థులకు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ నిర్వహించామని, అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏజీఎంఓ, లైబ్రేరియన్ తాతారావు అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సును పునరుద్ధరించాలి

- ఆర్టీసీ అధికారులకు కింజంగితో పాటు ఐదారు గ్రామాల ప్రజల విన్నపం

**వంగర, జనవరి 8 (వార్త):** వంగర మండలంలోని కింజంగి గ్రామనకు ఆర్ టి సీ బస్సును పునరుద్ధరించాలని కింజంగి సర్పంచ్ ప్రతినిధి బొంతు వెంకటరావు, గ్రామస్థులు సంబంధిత అధికారులను కోరారు.

గత 10ఏళ్లుగా రాజాం నుంచి కింజంగి వరకూ బస్సును నడిపే వారని, ఇటీవలగా చిన్నపాటి కారణాలు వల్ల బస్సును నిలుపుదల చేశారని, దీంతోప్రజలు బస్సు కోసం నానా ఇబ్బందులకుగురికావలసి వస్తుందని వారు వాపోయారు.

ప్రజలు సుమారుగా ఏడెనిమిది గ్రామాల చెందిన ప్రజలం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కింజంగి వరకూ బస్ నడపక పోవటం వల్ల మండలంలోని కింజంగి, కింజంగి అర్ అండ్ ఆర్ కాలనీ,ఇరువడ, కోనంగిపాడు తదితర గ్రామాల ప్రజలు బయటకు ఎటు వెళ్ళాలన్నా కనీసం నాలుగైదు కిలో మీటర్లు నడిస్తే తప్ప బయట ప్రపంచాలకు చేరుకోలేమని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పురుషులు ఏదోవిధంగా నడిచి బలిజిపేట మండలంగంగాడ గ్రామనకు బస్ కోసం వెళ్ళవలసి వస్తుండటంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాకుండా సాయంత్రం వేళల్లో బయట పట్టణ ప్రాంతాల నుంచి వస్తున్నప్పుడు ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాలకొండ ఆర్టీసీ డిపో వారు వెంటనే బస్సు కింజంగివరకూ నడపాలని ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు తదితరులు కోరుతున్నారు.



కింజంగి సర్పంచ్ ప్రతినిధి బొంతు వెంకటరావు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మోదీ సభకు పలాస ప్రజలు



**పలాస, జనవరి 8(వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు పలాస కూటమి కార్యకర్తలు బుధవారం బయలుదేరి వెళ్లారు. విశాఖపట్నం మోదీ సభ నిర్వహిస్తున్న సందర్భంగా జనాలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. బుధవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి అశేష జనవాహిని తరలించేందుకు కూటమి నాయకులు సఫలీకృతమయ్యారు.

# ప్రభుత్వ ఆస్తికి నష్టం చేసి..పలాయనం..!

**-చోద్యం చూసిన అధికారులు**

**- 30 గ్రామాలకు తాగునీరు బంద్**

**-చివరకు మెగా సంస్థతో పనులు**







**మందస, జనవరి 8(వార్త):** బలమున్నవాడిదే రాజ్యం.. ఇదే ముమ్మాటికీ నిజమని ప్రజలు చెప్పుకొంటున్నారు. ఏకంగా ప్రభుత్వ ఆస్థులకు నష్టం కలిగించిన ఓ సంస్థ.. యథేచ్ఛగా, నిర్భయంగా మందసను దాటేసింది. ప్రభుత్వానికి, ప్రజలకు కలిగిన నష్టం ఆ సంస్థ ద్వారా రాబట్టుకోవాలన్న ప్రయత్నాలు బెడిసికొట్టాయి. అధికారులు చేతకానితనంగా స్థానికులు పేర్కొంటుండగా.. ఇదే వాస్తవం అన్నట్టు నష్టం కలిగించిన నిర్వాహకులు అందరి కళ్లముందే జారుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మేజరు పంచాయతీ మందస పట్టణంలో శివార్లో ఉన్న ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వద్ద ఇటీవల ఓ సంఘటన జరిగింది. ఓ పెద్ద గ్రానైట్ను తీసుకెళ్తున్న అతిపెద్ద లారీ ప్రమాదానికి గురైంది. లారీ ట్రాలర్ బోల్తా పడడంతో భారీ రాయికూడా కింద పడింది. అతిపెద్ద ప్రమాదం తప్పినప్పటికీ, ఆసుపత్రి ప్రహరీగోడ కొద్ది భాగం దెబ్బతింది. అంతేకాక జలజీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు 30 గ్రామాలకు వెళ్తున్న తాగునీటి పెద్ద, పెద్ద పైపులు పగిలిపోయాయి. దీంతో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంఘటనకు బాధ్యులపై ఇటు మందస పీహెచ్సీ, అటు పంచాయతీ, జేజేఎం అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరించారు. ప్రజలకు కలిగిన నష్టాన్ని భర్తీ చేయించాల్సిన అధికారులు లారీ స్వాధీనం చేసుకోలేకపోయారు. బోల్తా పడిన వెంటనే ఇంజిన్ను సంబంధిత సంస్థ క్షణాల్లోనే తీసుకెళ్లిపోయింది. మందస పంచాయతీ సిబ్బంది ట్రాలర్ వద్ద ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని కాపలా పెట్టగా, ఆయన చేతకానితనంతో రాత్రికి రాత్రే ట్రాలర్ను కూడా తీసుకెళ్లిపోయారు. అంతేకాదు అతిపెద్ద గ్రానైట్ రాయిని అనధికారికంగా పేల్చేసి, చిన్న ముక్కలుగా చేసేశారు. పెద్ద శబ్దాలు వచ్చాయని స్థానికులు చెబుతుండగా.. బాంబులతోనే పేల్చేసి ఉంటారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ జరిగినా.. అధికారుల్లో చలనం లేదు. పోలీసులకు సమాచారం ఇచ్చామని మందస పంచాయతీ చెబుతోంది. కానీ, చర్యలు శూన్యమయ్యాయి. ప్రభుత్వ ఆస్థులతో పాటు ప్రజలకు మంచినీరు అందకుండా చేసిన బాధ్యులను నాలుగైదు శాఖాధికారులు వదిలేశారు. చేసేది లేక గతంలో పనులు చేసిన మెగా సంస్థతో నీటి పథకానికి మరమ్మతులు చేయిస్తున్నారు. బలమున్నోడు దర్జాగా తప్పించుకోగా.. తమకు తప్పదన్నట్టు దెబ్బ తిన్న పథకాన్ని బాగు చేయిస్తున్నారు. అధికారుల తీరుపై ప్రజలు నవ్వుకుంటున్నారు.

# రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం ప్రాజెక్టుకు మొదటి స్థానం

**-రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విజేతగా జస్వంత్**

**-గైడ్ టీచర్, విద్యార్థులకు అభినందనల వెల్లువ**



**పలాస, జనవరి 8(వార్త):** రాష్ట్రస్థాయి పోటీల్లో జస్వంత్ విజేతగా పలాస హై స్కూల్ ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టు ఎంపికైంది. సదరన్ ఇండియా సైన్స్ ఫెస్ట్ 2024 -2025 విద్యా సంవత్సరానికి సరేట్, సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జనవరి 7, 8 తేదీల్లో నిర్వహించబడిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జస్వంత్ పాత్రో గైడ్ టీచర్ జినగ షణ్ముఖరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం ప్రాజెక్టుకు వ్యక్తిగత విభాగంలో రాష్ట్ర స్థాయిలో కైవసం చేసుకున్నారు. విజేతలకు సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస రావు బహుమతి ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో గెలుపొందిన విద్యార్థి, గైడ్ టీచర్ కు పాఠశాల హెచ్ఎం డి .దాశరధి, పాఠశాల యాజమాన్య కమిటీ తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## వంగర పశు వైద్య కేంద్రంలో
# పారిశుధ్య లేమి

**వంగర, జనవరి 8(వార్త):** మద్యం బాటిళ్లు,చెత్తా చెదారాలుతో కంపు మద్యను వంగర మండల కేంద్రంలో ప్రభుత్వ పశువైద్య శాల ఉండటంతో సర్వత్రా విమర్శల వెల్లువెత్తు తున్నాయి. భవనం చుట్టూ మొత్తం ఎటు చూసిననూ మద్యం బాటిళు ,,పూర్తిగా చెత్తతో నిండి పోయి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పూర్తిగా పరిసరాలను పట్టించుకోవటం లోదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రం కావటమే కాకుండా,ప్రధానహాస్పటల్ పరిస్థితి ఈ విధంగా ఉండటం పట్ల మండిపడుతున్నారు. సచివాలయ వ్యవస్థ రాక ముందు మండలానికి సంబంధిన 37గ్రామాలకు ప్రధాన పశు వైద్య కేంద్రం ఈ మండల కేంద్రంలో ఉండేది.ప్రస్తుతం సచివాలయాల్లో వెటన్నరీ అసిస్టెంట్లు న్నప్పటకీ ఈ హాస్పటల్ కే పలు గ్రామాల నుంచి రైతులు పశువులను వైద్య సేవల కోసం ఇచ్చటకే తీసుకు రావటం కనిపిస్తుంది. అయినప్పటికీ ఈ హాస్పటల్ చుట్టూ ఇలాంటి మద్యం సీసాలు, పూర్తిగా చెత్త మయంగా తయారై నప్పటికీ పూర్తి గా సంబంధిత శాఖాధికారులు పూర్తిగా పట్టించుకోవటం లేదన్నది హాస్పటల్ పరిసరాలను పరిశీలిస్తే చెప్పక తప్పదు. దీనికి తోడు గత కొన్ని నెలలుగా ఈ పశువైద్య కేంద్రానికి పూర్తిస్థాయి వైద్యాధికారి లేకపోవడం, ఇన్చార్జీలతో నడపలు వలన ఈ విధంగా తయారయిందని చెప్పవచ్చు మరి. ఇప్పటికైన నూ సంబంధితఅధికారులు కల్పించుకొని హాస్పటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేటట్లు చూడవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పొచ్చు.

# సంక్రాంతి సంబరాలు



**పలాస, జనవరి 8(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె, వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా,కన్నుల పండుగగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా భోగి మంటలు వేసి సంక్రాంతి చక్ర పొంగలి తయారు చేసి విద్యార్థిని విద్యార్థులుకు అందించారు. కళాశాల క్రీడా ప్రాంగణంలో రంగురంగుల గాలి పటాలను విద్యార్థులు ఎగరవేశారు. విద్యార్థిని విద్యార్థులకు రంగవల్లికల పోటీని నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఎనలేని ఉత్సాహం ప్రదర్శిస్తూ రంగురంగుల అందమైన ముగ్గులను వేసి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను చేజకించుకున్నారు, విద్యార్థులు వేసిన రంగవల్లికలు



ఆహుతలను ఎంతగానో అలరించాయి, కళాశాలలోని మహిళా సాధికారిక విభాగము ఐక్యుఏసి విభాగం పర్యవేక్షణలో గాను నృత్య పోటీలు కూడా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతీయత అంటేనే సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని అన్నారు. ఈ పండుగలు ఆచారాలు కొన్ని వందల ఏళ్లుగా ఒక తరము నుండి మరొక తరానికి అనువర్తి తమవుతుంటాయని సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమము చివర్లో విద్యార్థుల కేరింతలు నృత్యాలతో అలరించారు, భోగి మంటలు రంగవల్లులు చూపులను విశేషంగా అలరించాయి, విద్యార్థులు అధ్యాపకుల సాంప్రదాయ వస్త్రధారణ ఆహుతులను ఆకట్టుకునేల కనిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్. గణపతిరావు ఐక్యూ ఏసి, కోఆర్డినేటర్ వెంకటరమణ, మహిళా సాధికారిక విభాగ అధ్యాపకులు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**సంప్రదాయాలు గుర్తొచ్చేలా ..**

**శ్రీ సత్యసాయి విద్యావిహార్ లో ..**

తెలుగింటి సంప్రదాయాలను గుర్తుచేసుకునే సంక్రాంతి సంబరాలు రామకృష్ణాపురంలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్ లో కనుల పండుగ నిర్వహించారు. పాఠశాలలో తెలుగింటి సాంప్రదాయాల ప్రకారం గంగిరెద్దు విన్యాసాలు, హరిదాసు కచేరిలు, రంగవల్లిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి విద్యా విహార్ పాఠశాల ట్రస్ట్ చైర్మన్ మల్ల రామేశం మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలను, ఆచరణలను గుర్తుచేసేది సంబరాలని అన్నారు. విద్యార్థులు చూడ చక్కనైన రంగువల్లిక పోటీలను చేపట్టారు. తరాల మారుతున్న మన సాంప్రదాయాలు మరవని అటువంటి సంక్రాంతి సంబరాలు చేసుకోవాలని అన్నారు. విద్యార్థి విద్యార్థులు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతను సంక్రాంతి రోజున పెడతామని అన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546